క్లుప్తంగా

వైద్య నిపుణుల నియామకం

మణుగూరుటౌన్: మండల కేంద్రమైన మణుగూరు 100 పడకల ఆస్పత్రి కొత్త శోభను సంతరించుకోనుంది. వైద్యుల లేమితో ఇబ్బందులు పడుతున్న సబ్ డివిజన్ ప్రజలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో ఏడుగురు స్పెషలిస్ట్ వైద్యులు రానున్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే పాయం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులు ఉండగా.. కొత్తగా గైనకాలజిస్టులు-2, పిల్లల వైద్యులు-1, అనస్తీషియాలజిస్టులు-2, స్కానింగ్ వైద్యుడు-1, జనరల్ ఫిజీషియన్-1 రానున్నారని తెలిపారు. కాగా ప్రస్తుతం ఐదుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు, ఒక దంత వైద్యుడు ఉండగా.. స్పెషలిస్ట్‌ల రాకతో వైద్యుల సంఖ్య 13కు చేరనుంది. దీంతో సబ్‌డివిజన్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో మంగళవారం పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఈఓ క్లబ్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గువ్వల సత్యవతి, ఉపాధ్యాయులు రమాదేవి, ఎం.సావిత్రి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దమ్మపేట: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం గెలుపొందిన దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని, మంగళవారం ఆ పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లోని కొల్లూరు గౌడియా క్రీడా పాఠశాలలో రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు మడకం కృష్ణవేణి, గుర్రం పావని పాల్గొన్నారు. జావెలింగ్ త్రో విభాగంలో మడకం కృష్ణవేణి అద్భుతమైన ప్రదర్శన చూపి కాంస్య పతకంను సాధించింది. ఈ సందర్భంగా కృష్ణవేణితో పాటుగా పోటీల్లో పాల్గొన్న పావనిని కూడా హెచ్‌ఎం ఆధ్వర్యంలో శాలువాతో మర్యాదపూర్వకంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో హెచ్‌ఎం చంద్రకళ, పీఈటీ కుర్సం వాణి, ఉపాధ్యాయులు కొండ్రు శ్యామల, పెంటయ్య, సీతారాం, రమేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

గుండాల: ఆళ్లపల్లి మండలంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజాపంథా మండల కార్యదర్శి గొగ్గెల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో రోడ్డు ఆక్రమణ విషయమై వివాదస్పదంగా మారుతోందని అన్నారు. డబుల్‌బెడ్‌రూం కాలనికి అనుకుని ఉన్న ప్రభుత్వం భూమి ఆక్రమణలకు గురౌతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. అధికారులు సర్వేలు చేపట్టి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోగ సారన్న, ఈసం సమ్మయ్య పాల్గొన్నారు.

కరెంట్, బోర్ల ఏర్పాటుకు అనుమతులు

ములకలపల్లి: పోడు భూముల్లో కరెంటు సౌకర్యం, బోర్లు ఏర్పాటుకు అనుమతులు లభించినట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం పలువురు రైతులు అనుమతి పత్రాలు అందుకున్నారు. ఈ మేరకు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. హక్కు పత్రాలు కలిగిన పోడు భూములకు విద్యుత్ లైన్లు నిర్మాణం, బోర్లు వేసుకునే అవకాశం కల్పించాలని గతంలో విన్నవించినట్లు ఓ పేర్కొన్నారు. పీఓ రాహుల్ ప్రత్యేక చొరవతో అటవీశాఖ అభ్యంతరం తెలుపకుండా.. అన్నివిధాలా అనుమతులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు పొడెం ప్రసాద్, మాజీ సర్పంచ్ గౌరి లక్ష్మి, నాయకులు వర్సా శ్రీరాములు, రావుల నాగేంద్రబాబు, సున్నం నాగులు, సోమిని కృష్ణ, రుద్రం శ్రీను ఉన్నారు.

ఇసుక ర్యాంపుల్లో పైసా వసూల్

- లోడింగ్‌కు అధిక చార్జీలు
- టీఎస్ఎండీసీ అధికారుల సమక్షంలోనే దందా?
- నష్టపోతున్న లారీల యజమానులు, వినియోగదారులు



ర్యాంపు వద్ద ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: మణుగూరులో నడుస్తున్న ఇసుక సొసైటీల్లో వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. వే బిల్లు తీసుకుని వచ్చే లారీల వద్ద నుంచి సదరు ర్యాంపులు దక్కించుకున్న బినామీ కాంట్రాక్టర్లు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ తంతు సాంబాయిగూడెం ఇసుక రీచ్‌లో జోరుగా సాగుతుండటం విశేషం. నిబంధనలకు మంగళం పాడి ర్యాంపు పరిసరాల్లోనే సీరియల్, పట్టా కట్టేందుకు.. లోడింగ్ చార్జీలు అంటూ వసూళ్లకు పాల్పడుతుండటం.. అక్కడే టీఎస్ఎండీసీ అధికారులు నోరెత్తకపోవడంతో లోడింగ్ వచ్చిన లారీల డ్రైవర్లు చేసేది లేక అడిగినంత ఇస్తున్నారు. ఇసుక కోసం వచ్చే లారీ యజమానులతో పాటు వినియోగదారులు సైతం ఈ దందా దాటికి తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.

అంతా ఆయనదే హవా..

సాంబాయిగూడెం గ్రామంలోని ఇసుక ర్యాంప్‌లో అనుమతులు లేకపోయినా ఇసుకను టన్నుల కొద్ది రవాణా చేస్తూ.. చక్రం తిప్పుతున్నాడు ఓ వ్యక్తి. ఈయన హవాకి కొంతమంది లారీ యాజమానులు ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితి. ఎవరు వచ్చిన ఈ అడ్డా అంతా నాదే అంటూ హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఇక్కడ అతడు చెప్పిందే రేటు.. కాదంటే నో లోడింగ్. అధికార పార్టీ అండదండలతో ఇసుక కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లారీకి రూ.2 వేలు..

ఇసుక రవాణాకు వచ్చే లారీలు హైదరాబాద్, కొత్తగూడెం, భద్రాచలం, ఇలా ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. వాటిని అదునుగా భావిస్తున్న బినామీ కాంట్రాక్టర్ ఇసుక ర్యాంపుల వద్ద లారీ సీరియల్, లోడింగ్ చార్జీలు, పట్టా కట్టేందుకు అంటూ 2వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. లేకుంటే లోడింగ్ లేదంటూ ధిక్కార స్వరం వినిపిస్తుండటంతో వందలాది మైళ్లు దాటి వస్తున్న లారీ డ్రైవర్లు చేసేది లేక అడిగినంత ఇచ్చి లోడ్ తీసుకెళ్తున్నారు. అదేంటి అని ప్రశ్నిస్తే రోజుల తరబడి సీరియల్ పేరిట కాలయాపన చేస్తూ సమయం అయిపోయింది.. ఇసుక వేరేదగ్గర ఉంది అంటూ లేనిపోని మాటలు చెబుతూ... ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు.

కాగా, ఇక్కడ పర్యవేక్షించే అధికారులు ఉన్నా.. మిన్నకుంటుండటం చూసి లారీ డ్రైవర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేసిన నేపథ్యంలో సంబంధిత అధికారులు వసూళ్ల పర్వంపై దృష్టి సారించి అడ్డుకట్ట వేయాలని వినియోగదారులు, లారీ యజమానులు కోరుతున్నారు.

అధిక లోడ్ చార్జీలతో ఇబ్బందులు

లోడింగ్ పేరుతో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పేరుతో ఇసుక లోడ్ ధరలను పెంచేశారు. మళ్లీ ఈ అధిక చార్జీలతో లారీ యజమానుపై అధిక భారం పడి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడింగ్ చార్జీలను నియంత్రించే చర్యలు చేపట్టాలి.

– వెంకట్, లారీ ఓనర్

జాతరకు ముమ్మర ఏర్పాట్లు



రహదారికి ఇరువైపులా లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామ శివారులో ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి జాతర ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ జాతర ఉత్సవాలకు ఆలయం వద్ద, ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసే పనులు చేపట్టారు. అలాగే ఆలయం వద్ద జాతర ఉత్సవాల నేపథ్యంలో రంగుల రాట్నం, బ్రేక్ డ్యాన్స్, రైలు బండి, ఇతర ఆట పరికరాలను వ్యాపారులు సిద్ధం చేస్తున్నారు. మరో వైపు దుకాణాలదారులు కూడా డేరాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఐదు రోజులపాటు జరిగే జాతర ఉత్సవాలకు అశ్వారావుపే, దమ్మపేట మండలాలతోపాటు పొరుగున ఉన్న ఏపీలోని ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దాదాపు మూడు లక్షల మంది భక్తులు హాజరు కానున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను కూడా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



మణుగూరురూరల్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మణుగూరురూరల్: రంగారెడ్డి జిల్లాలో సీనియర్ న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా మణుగూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు నల్లబ్యాడ్జిలతో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియర్ న్యాయవాదిని హత్యచేయడం అమానుషమన్నారు. న్యాయవాదిని హత్య చేసిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు రెండు నిముషాలు మౌనం పాటించి న్యాయవాది ఇజ్రాయేల్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు దాసరి కవిత, చిర్రా సరస్వతి, పొనుగోటి కిషన్‌రావు, అంకం సర్వేశ్వరరావు, చిర్ర రవి, వీరమధుసూదన్, జాడి చొక్కారావు, పద్మావతి, సావిత్రి, నగేష్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రుద్ర వెంకట్, నాగార్జున్‌రెడ్డి, రమేష్, మోహన్ సాయి, బిక్కసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: హైదరాబాద్‌లో జరిగిన న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను ఖండిస్తూ.. దమ్మపేట బార్ అసోసియేషన్ సభ్యులు, మంగళవారం కోర్టులో విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాది హత్యను అత్యంత హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీష్, ఉడతనేని శ్రీనివాసరావు, గొంది మురళీ, లక్కినేని నరేంద్ర, తుమ్మా రాంబాబు, శ్యాం సుధాకర్, గద్దల అప్పారావు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ఆందోళన

మణుగూరురూరల్: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మున్సిపాలిటి పరిధిలోని రాజుపేట గ్రామస్తులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి పరివాహక ప్రాంతం నుండి రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నారని, తద్వారా తామంతా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అక్రమ తోలకాల వల్ల డ్రైవర్లు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారని, తామంతా ప్రాణభయంతో జీవనం సాగించాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

టోర్నమెంట్‌లో బీటీపీఎస్ విజయం



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరుటౌన్: ఐదు రోజులుగా భూపాలపల్లి చెల్పూర్‌లో జరుగుతున్న ఇంటర్ ప్రాజెక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడి బీటీపీఎస్ జట్టు ప్రథమ స్థానంలో నిలవడాన్ని హర్షిస్తూ సీఈ బిచ్చన్న మంగళవారం క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులతో సీఈ మాట్లాడుతూ... కాకతీయ థర్మల్ పవర్ వద్ద జరిగిన ట్రోఫీలో అన్ని థర్మల్ హైడల్ ప్రాజెక్టుల నుంచి 14 జట్లు పాల్గొనగా, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ జట్టు హోరాహోరీగా పోరాడి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉత్తమమైన పటిష్ట జట్టుపై విజయం సాధించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు, కళాకారులను సంస్థ ప్రోత్సహిస్తూనే ఉంటుందన్నారు. విధులు బాధ్యతలు అంకితభావంతో క్రమశిక్షణతో నిర్వహించాలని సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్వతి, శ్రీనివాసరావు, రమేష్ బాబు, చంద్రశేఖర్, మూర్తి, కల్తీ నర్సింహారావు, నాగేశ్వరరావు కెప్టెన్ గోపాలకృష్ణ ఉన్నారు.

'నవోదయ'కు ఎంపిక

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరానికి చెందిన విద్యార్థి జుంజురి తనిష్క్ సింహ జవహర్ నవోదయకు ఎంపికయ్యాడు. నవోదయలోని ఆరో తరగతిలో 80సీట్ల భర్తీకి జనవరి 18న నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఆయనకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా తనిష్క్‌ను కిడ్స్ కాప్టివేషన్ స్కూల్ యాజమాన్యం మంగళవారం అభినందించారు.

పాత్రికేయుడి మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఓ దినపత్రిక పాత్రికేయుడు మదమంచి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ కొత్తగూడెంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సత్యనారాయణ మృతి పట్ల పాత్రికేయులు, అధికారులు, పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేసి మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా వారి మందిరంల్లో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. పట్టణానికి చెందిన మల్లాది వెంకటరామారావు జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదానానికి రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సమేతంగా బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయక కమిటీ సభ్యులు దాతలకు స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మనాపల్లి ఆదినారాయణ, అబ్బినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రలు పంపిణీ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ వారి ద అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి సహకారంతో వంట పాత్రలను అందజేశారు. మండల విద్యా వనరులు కేంద్రంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య చేతుల మీదుగా వీటిని అందుకున్న పాఠశాల ఉపాధ్యాయులు వీటిని సదరు వంట ఏజెన్సీలకు అందజేశారు. హెచ్‌ఎం ఏవీ రామారావు, ఉపాధ్యాయులు మైఖేల్, శ్రీనివాస్, రమేష్, రామకృష్ణ,గ్రామ పెద్దలు కొత్తూరి, సీతారామ రావు, షైక్, హుస్సేన్ అహ్మద్, రాంబాబు, టీచర్లు, మధ్యాహ్నం వంట ఏజెన్సీ వాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ అవాస్తవం

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ముక్తిర్ పాషా రోడ్డును ఆక్రమణ చేసిన ఇంటి నిర్మాణం చేపట్టాడని వస్తున్న ఆరోపనలో వాస్తవం లేదని తుడుందెబ్బ నిర్ధారణలో తేలిందని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంపిడి వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకనటలో తెలిపారు. భూమిని పూర్తి ఆధారాలతో ముక్తార్ పాష కొనుగోలు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది వారి స్వార్థం కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ములకలపల్లి: మండల కేంద్రంలోని విజయపురి కాలనీలో సీపీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు. విద్యుత్ దీపాలు, రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుగున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గం శాసన సభ్యుడు జారే ఆదినారాయణ చొరవతో కాలనీలో రూ.22 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఆర్ ఏఈ సురేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పాలకుర్తి సుమిత్, చిర్రా భద్రమ్మ, చల్లా వెంకటేశ్వర్లు, పొన్నూరు హరి తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆర్‌డీడీ సీతారాములు

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో చేపడుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) భవన నిర్మాణ పనులను ఆర్‌డీడీ బి.సీతారాములు మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అన్ని విభాగాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏటీసీ ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో ప్రయోజనకంగా ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక విద్యా విధానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఐటీఓ జి.రవి, సూపరింటిండెంట్ టీఎస్ జ్యోతిరాణి, వీటీఓలు జీవీ కృష్ణారావు, ఎం.శ్రీనివాసరావు, నరసయ్య, వేణుగోపాల్, ఏటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మరమ్మతు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ తిరుపతమ్మ, రైతులు

మణుగూరురూరల్: మండలంలోని సాంబాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి పేరంటాల చెరువు నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ కోరారు. మణుగూరులో మంగళవారం ఆమె రైతులతో కలిసి మాట్లాడారు. గత ఏడాది వర్షాకాలంలో పేరంటాల చెరువు తూము మరమ్మతుకు వస్తే రైతుల వినతితో బీటీపీఎస్ యాజమాన్యమే తూమును మూసివేయించి, యాసంగిలో తిరిగి తెరిపించిందని తెలిపారు. ఏటా పేరంటాల చెరువు తూము ద్వారా ఏడూళ్లబయ్యారం వెళ్లే కాలువలో పూడికతీత పనులు చేయిస్తోందన్నారు. ఈ నేపథ్యాన కొందరు నాయకులు బీటీపీఎస్ యాజమాన్యంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాగా, అధికారులు స్పందించి తూము శాశ్వత మరమ్మతు చేయించి రెండు పంటలు సాగయ్యేలా నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో షేక్ మురుసుద్దీన్, శోభన్‌బాబు, వెంకట నరసయ్య, వంగ కృష్ణయ్య, రామయ్య, మాటూరి నారాయణ, మడి రాము, వెంకన్న, సబ్బతి నరసయ్య, లింగయ్య, గిరిబాబు, కుమారస్వామి, భాస్కర్, సుదాకర్, అలవాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయాలి



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న న్యాయమూర్తి శివనాయక్

భద్రాచలంటౌన్: వసతి గృహంలోని విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేసి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ అన్నారు. పట్టణంలోని పోస్ట్ మెట్రిక్ డిగ్రీ గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని వార్డెన్‌తో పాటు సిబ్బందిని హెచ్చరించారు.

ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు అందజేస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

దుమ్ముగూడెం: మండలంలోని దివ్యాంగ విద్యార్థులకు విద్యాశాఖ (సమగ్ర శిక్ష), అలింకో వారి ఆధ్వర్యంలో ఉపకరణాలను తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సున్నం సమ్మయ్య చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. మండలంలో 18 మంది దివ్యాంగ చిన్నారులకు వివిధ రకాలైన ఉపకరణాలు అందాయి. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపాధ్యాయులు కె.రాగిణి, గద్దల సతీష్, ఉయికా బాబురావు, దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

ములకలపల్లి: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎస్ఎస్‌సీ ప్రత్యేకాధికారి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ టి.రమణయ్య తెలిపారు. మండలపరిధిలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ స్టూడెంట్స్‌తో మాట్లాడారు. ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా పరీక్షలకు హాజరవ్వాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలోని 30 విద్యార్థులకు చక్కటి మార్కులు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం బుచ్చిరాములు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

దమ్మపేట: అర్హత కల పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం, దమ్మపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాస్‌లైన్ ఆధ్వర్యంలో కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. ప్రతీ పేదవాడికి రేషన్ కార్డు, ఆసరా పెన్షన్, ఇల్లు తదితర సంక్షేమ పథకాలను ఇచ్చి ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరబాబు, నాగమణి, సుజాత, జగదీష్, నాగవల్లి, దుర్గాప్రసాద్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ అడ్వైజర్‌కు సన్మానం

దుమ్ముగూడెం: బీఆర్ఎస్ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా ఎంపికైన అడ్వకేట్ కొత్త మల్లేశ్వర రావును బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా సన్మానించారు. లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో శాలువా కప్పిన మండల కన్వీనర్ కణితి రాముడు, కో-కన్వీనర్ ఎండి.జానీపాషాలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ కాలువ పూర్ణయ్య, నాయకులు దామెర్ల శ్రీనివాస్, లంక శివ, వాగె కృష్ణ, ఆకుల అనిల్, జంగిటి రాము, పాడకలపల్లి శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దమ్మపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆశా వర్కర్లు

హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లపై లాఠీచార్జ్, అరెస్టులను ఖండిస్తూ.. స్థానికంగా పలుచోట్ల రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు మంగళవారం దహనం చేశారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకపోగా.. ధర్నాను అడ్డుకునేలా అరెస్టులకు పాల్పడ్డారంటూ ప్రభుత్వ చర్యలను విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు ఆశాల వేతనం రూ.18 వేలకు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడులో నిరసన చేపట్టిన ఆశా వర్కర్లు



దుమ్ముగూడెం: ములకపాడు సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఆశాలు, నాయకులు